క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కరప: సీజనల్ వ్యాధులపై **ప్రజలకు అవగాహన** కల్పించి తీసుకోవాల్సిన **జాగ్రత్తలను తెలియజేయాలని** మండల **వైద్యాధికారి డాక్టర్** ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం **ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు,** సీహెచ్ఎన్‌ఓలు, సూ**పర్‌వైజర్లతో** ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పీహెచ్‌సీలలోనే డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీహెచ్‌ఓలు వై.రత్నకుమారి, టీబీటీ సుందరి తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలందించాలి



ర్యాలీ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

బాలాజీచెరువు: పాలసీదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, ప్రజలతో మమేకం కావాలని కాకినాడ ఎల్ఐసీ మెయిన్ బ్రాంచి మేనేజర్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 7 తేదీ వరకూ ఆ సంస్థ 67వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ పథకాల ప్లకార్డులు చేతబట్టి ఈ ప్రదర్శన చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఈ సంస్థ ఉందన్నారు. ఎల్ఐసీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఏజెంట్లు, ఉద్యోగులు కాపాడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలోని ఎల్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి సేకరించిన బీజేపీ నేతలు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని 1వ డివిజన్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు, కవికొండల భీమ శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి సేకరణ చేశారు. నా భూమి–నాదేశంలో భాగంగా నిర్వహించిన ఈ సేకరణలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ మేధావుల కమిటీ విభాగం ముత్తా నవీన్‌కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: సమస్యల పరిష్కారం కోరుతూ యానిమేటర్లు మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ పి.రమణికి వినతి పత్రం అందజేశారు. బకాయి వేతనాలు ఇవ్వాలని, కోళ్లు, పాలు, కూరగాయలు టార్గెట్లు తీసివేయాలని తదితర డిమాండ్లు చేశారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు గండి మేరీ, డి ఆనంద్ పాల్గొన్నారు.

ముగ్గురికి ఈవో పీఆర్డీగా పదోన్నతి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీరామ్‌కు ఈవో పీఆర్డీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఆయనతో పాటు కాకినాడ జిల్లాలోని అన్నవరం, ధర్మవరం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఈవో పీఆర్డీగా పదోన్నతి లభించింది.

ప్రైవేటు పాఠశాలపై ఈఓ పీఆర్డీ విచారణ



పీబీ దేవం పంచాయతీ కార్యాలయంలో సమాచారం సేకరిస్తున్న ఈఓపీఆర్డీ సత్యారెడ్డి

సామర్లకోట: పీబీ దేవం ప్రైవేటు పాఠశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ సభ్యులు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఈఓ పీఆర్డీ హిమమహేశ్వరి 11 తప్పులను గుర్తించినట్టు ప్రస్తుత ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి అన్నారు. 'ప్లాను లేదు.. పన్ను చెల్లించరు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ, ఈఓ పీఆర్డీ విచారించాల్సి ఉంది. అయితే డీఎల్‌పీఓ ఎన్నికల విధులలో ఉండటంలో ఈఓ పీఆర్డీ ఒక్కరే పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, కార్యదర్శి రామ్‌నాథ్‌ల నుంచి వివరాలు సేకరించారు. త్రివర్ణ పబ్లిక్ స్కూల్ కొడా అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు పాఠశాలకు ఎన్‌ఓసీ లేదని వివరిస్తూనే, నిర్మాణంలో 11 తప్పులున్నట్టు అప్పటి కమిటీ ఇచ్చిన నివేదిక నకలును వారు ఎంపీడీఓ డి.శ్రీలలితకు అందజేశారు. స్కూల్ రెన్యూవల్‌కు అనుమతి ఇవ్వడానికి వీలు లేదని 2020 లోనే పంచాయతీ తీర్మానం చేసినా అప్పటి ఎంఈఓ పంచాయతీ తీర్మానాన్ని లెక్క చేయకుండా రెన్యూవల్ చేశారని సూరిబాబు విచారణాధికారికి తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు వివరిస్తానని విచారణాధికారి సత్యారెడ్డి తెలిపారు.

గురువే దైవం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన విశ్రాంత ఉపాధ్యాయులు



మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: **తల్లిదండ్రులు తరువాత గురువే దైవమని, ఉపాధ్యాయ వృత్తి చాలా** గౌరవప్రదమైనదని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం, గైగోలుపాడు మూర్తి స్కూల్‌లో మంగళవారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ గణేష్‌బాబు అధ్యక్షతన జరిగిన వేడుకలో డాక్టరు సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని సరస్వతి దంపతులు, మండల ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన బీవీ సుమంగళి, టి.శేషుకుమారి, పి.శేషమాంబ, ఎం.విజయలక్ష్మి, టీపీ రత్నమాల తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వప్న, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, ఎంఈఓ–2 ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో..

అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ కమలకుమారి, నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు కాసిన త్రినాథ ప్రసాదరావు, కమ్మిల సత్యనారాయణమూర్తి, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, జనపరెడ్డి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులను అడబాల రత్నప్రసాద్, ఉషారాణి, అడబాల సత్యనారాయణ, రెడ్నం రాజా, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు సన్మానించారు.

నగరంలోని విద్యా సంస్థల్లో..

బాలాజీచెరువు: నగరంలో పలు విద్యా సంస్థల్లో ఘనంగా గురుపూజోత్సవాలు నిర్వహించారు. జేఎన్‌టీయూకే ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రెడ్నం అప్పలరాజు, శ్రీరామ్‌నగర్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత రెడ్నం అప్పలరాజు, విశ్రాంత ఐటీఐ ప్రిన్సిపాల్ సోమయాజులు, విశ్రాంత ఉపాధ్యాయిని అన్నామణిలను బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అద్దంకి శివప్రసాద్, సిబ్బంది సత్కరించారు.

గాంధీనగర్‌లో అలయన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నడకుదురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సుజాత, ప్రమోద కుమారి, సూర్యకుమారి, ఆర్.వినయ్ హనోక్, బీవీవీఎస్‌వీ ప్రసాద్‌ను క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు సత్కరించారు.

జేఎన్‌టీయూకేలో...

జేఎన్‌టీయూకేలో నిర్వహించిన గురుపూజోత్సవంలో వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పాల్గొని అధ్యాపకులు నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థులకు ఉత్తమంగా బోధించవచ్చని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా తమ వర్సిటీ నుంచి ముగ్గురు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాశాల ఉత్తమ అధ్యాపకులుగా ప్రొఫెసర్ శ్రీనివాసులు, కె.రవీంద్ర, వి.జయప్రసాద్, కె.రాజశేఖర్, ఎస్.సురేఖ, పద్మజారాణిలను సత్కరించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



జేఎన్‌టీయూకేలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

పెన్షనర్స్ భవన్‌లో..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ అర్బన్ ఎంఆర్‌ఓ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ భవన్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని మంగవారం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం, కార్యదర్శి శాస్త్రి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు పి.శ్రీలక్ష్మి, కె.రాణి, జి.శ్యామసుందరి, ఎస్.శేషగిరిరావు, వి.రమాకాంతరావు, సిహెచ్ సుబ్బారావులను ఘనంగా సత్కరించారు.

విజయదుర్గకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



మంత్రి బొత్స చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం అందుకుంటున్న తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కడలి విజయదుర్గ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయిని కడలి విజయ దుర్గ కాకినాడ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా 2023 ప్రధానోపాధ్యాయుని కేటగిరిలో ఎన్నికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఆమె అవార్డును తీసుకున్నారు.

మానవవనరుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



కరపలో జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మానవ వనరుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందని, అటువంటి మానవ వనరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మహ్మద్ అబ్దుల్ అలీమ్ దంపతులను, జిల్లా ఉత్తమ కెరీర్ గైడెన్స్ అవార్డు గ్రహీత లక్ష్మీనారాయణను, మండలస్థాయిలో ఆరు కాంప్లెక్స్‌ల నుంచి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు కె.సీతామహాలక్ష్మి (కరప), పీవీఎస్ రమణమూర్తి (గురజనాపల్లి), కె.సత్యవతి (గొర్రిపూడి), టి.వీరమణి (కొంగోడు), ఎస్.ఉమాదేవి (వేళంగి), జీవీఎస్‌డీఎస్ శ్యామలారాణి (వలసపాకల), డి.శ్యామలారాణి (యండమూరు), బెస్ట్ సీఆర్పీ ఎస్.కుమారిలను ఉపాధ్యాయుల తరపున ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతిలతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చింతా నారాయణమూర్తి, షేక్‌వల్లీ బాషా హాజరై జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అలీమ్‌ను సత్కరించారు.



కరప హైస్కూలు ఉపాధ్యాయులు అప్పారావు, రాములుకు సత్కారం..

తర్వాత ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీపీ, జెడ్పీటీసీలను ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణలు సత్కరించారు. ముందుగా ఎమ్మెల్యే కన్నబాబు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించి, గురుపూజోత్సవాలను నిర్వహించారు. ఎన్‌జీ రంగా వర్సిటీ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, చోడి శెట్టి చంటి, ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొన్నారు.



గురజనాపల్లి హైస్కూలులో ప్రసాదరావుకు సత్కారం..

పలు పాఠశాలల్లో..

అలాగే హైస్కూలులో ఉపాధ్యాయులు కాదా అప్పారావు, మాడ రాములను, గురజనాపల్లి హైస్కూలులో స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావును ఘనంగా సత్కరించి, మెమొంటోను అందజేశారు. హెచ్ఎంలు యు.లీలా మనోహర్, ఎంఏ సాయిమోహన్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కల్సి సత్కరించారు.

నిబంధనల ప్రకారమే విచారణ ప్రక్రియ

- కమిషనర్, ఈఆర్వో నాగ నరసింహారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ నాగ నరసింహారావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఓటర్ల జాబితా జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్, ఈఆర్వో సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్లో సోమవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా తుది రూపకల్పనను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. వారిచ్చిన సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆచూకీ లభించని ఓటర్లకు సంబంధించి బీఎల్వోల స్థాయిలో విచారణ అనంతరం అందుబాటులో ఉన్న చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమాచారం పంపిస్తున్నామన్నారు. నిర్ణీత కాల పరిమితిలోపు సమాధానం రాని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సిటీ నియోజకవర్గ పరిధిలో 1400 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న 18 పోలింగ్ స్టేషన్లను గుర్తించామన్నారు. అదనపు ఓటర్లను రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండే సమీప పోలింగ్ స్టేషన్‌కు సర్దుబాటు చేస్తామన్నారు. అలాగే ఒకే ప్రాంగణంలో ఐదు కన్నా ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్న 8 ప్రాంతాలను గుర్తించామని, స్థానిక పరిస్థితులు, ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని రాజకీయ పార్టీలతో చర్చించిన తరువాత తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీలు తమ వంతు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తాహసీల్దార్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధులు రాగిరెడ్డి సుబ్బారావు, రావూరి వెంకటేశ్వరరావు, ఎంజికే కిశోర్, టీడీపీ ప్రతినిధులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, బీఎస్పీ నుంచి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితాకు చర్యలు

కాకినాడ సిటీ: ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, తొలగింపులు గ్రామాంతరంలో ఉన్న ఓటర్ల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఈఆర్వో ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన



జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు, అధికారులు

కరప: పాడి రైతులకు ప్రయోజనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. కరప శివారు పేపకాయలపాలెంలో మంగళవారం రైతులతో ఆమె మాట్లాడారు. జగనన్న పాలవెల్లువలో సభ్యులుగా చేరితే, పాలు పోసే రైతులకు ప్రైవేటు డెయిరీలకంటే ఎక్కువ ధర లభిస్తుందన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కేంద్రం ఏర్పాటుచేసేందుకు 11 మంది మహిళా పాడిరైతులు కమిటీగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారి నుంచి ఒక కార్యదర్శిని ఎన్నుకోవాలన్నారు. గ్రామంలో కమిటీ ద్వారా పాలసేకరిస్తామన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్ జగనన్న పాలవెల్లువ కేంద్రం ఏర్పాటు, పాలసేకరణ, ఆర్థిక ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, రాయుడు శ్రీనివాస్, ఏపీఎం ఎంఎస్‌టీ దేవి, గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పనుల్ని నాణ్యతతో పూర్తి చేయాలి

కలెక్టర్ కృతికా శుక్లా



సామర్లకోటలోని జగనన్న కాలనీని పరిశీలించిన కలెక్టర్ కృతికా శుక్లా, హౌసింగ్ చైర్మన్ దొరబాబు

సామర్లకోట: జగనన్న కాలనీ పనుల్ని నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు కృతికా శుక్లా అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలోని జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి రానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి ఆమె పనులను పరిశీలించారు. జగనన్న కాలనీలో ప్రధాన రోడ్డు, డ్రైన్లు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పనుల నాణ్యతకు ప్రాధాన్యమిస్తారన్నారు. కాలనీలో ఆర్చిగేటు వద్ద పూర్తి కాని ఇళ్లు పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు ఇవ్వాలన్నారు. కాలనీలోని మౌలిక సదుపాయాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీ వద్ద ఏర్పాటు చేసిన పార్కులో ఆడుకుంటున్న పిల్లలతో ముచ్చటించిన కలెక్టర్ ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డీఈ రాజ్‌కుమార్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, తహసీల్దార్‌లు ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో మౌలిక వసతుల కల్పన

గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎమ్మెల్యే ద్వారంపూడికి సమస్యలు వివరిస్తున్న మహిళ

కాకినాడ: కాకినాడ–సామర్లకోట రోడ్డులోని ప్రజల విజ్ఞప్తి మేరకు ఐదు రహదారులు, సెంట్రల్ లైటింగ్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక సామర్లకోట రోడ్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యల సత్వర పరిష్కారానికి సీఎం జగన్ ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించారని, కాబట్టి స్థానిక సమస్యలు సులభంగా పరిష్కారమవుతున్నాయన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి యార్లగడ్డ పద్మజ, నాయకులు పాల్గొన్నారు.

నల్లనయ్యా రావయ్యా..

- కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాల ముస్తాబు
- విద్యుద్దీపాలంకరణలతో ధగధగలు
- అలరించనున్న అల్లరి రాధాగోపాలురు



కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబవుతున్న అశోక్‌నగర్‌లోని గోకులం

బోట్‌క్లబ్: కృష్ణాష్టమి వేడుకలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలు, ఆవరణలు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. స్థానిక అశోక్‌నగర్ గోకులంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు గోకులం అధ్యక్షుడు నారాయణం మురళి తెలిపారు. ఈ నెల 7న ఉదయం గోపూజ, పల్లకి సేవ, ఉదయం 10 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణ స్వామి శాంతి కల్యాణం, సాయంత్రం పదేళ్ల లోపు చిన్నారులకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణ పోటీలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ నెల 8న స్వామి వారికి ద్వాదశార్చన, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. స్థానిక దేవాలయంవీధిలోని ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్థానిక గాంధీనగర్‌లో ఉన్న కృష్ణుడి ఆలయంతో పాటు నగరంలోని పలు కృష్ణుని ఆలయాల్లో అష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కరపలో కృష్ణాష్టమి ఏర్పాట్లు

కరప: స్థానిక విష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ వడ్డాది సత్తిబాబు తెలిపారు. మండల పరిధిలోని జెడ్.భావారం, పెనుగుదురు, కూరాడ తదితర గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక రామారావుపేటలోని మునుసూరి సుబ్బారావు, శ్రీమతి రావమ్మ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు సంస్కార భారతి, ది గోదావరి కళా కౌముది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాజిబోయిన వెంకటేష్ నాయుడు తెలిపారు. నాలుగేళ్ల లోపు బాలలకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 5 నుంచి 8 ఏళ్ల బాలలు శ్రీకృష్ణవేషధారణతో పాటు శ్రీకృష్ణ శతక పద్యాలలో ఒక పద్యం విధిగా పాడాలని తెలిపారు. పేర్ల నమోదుకు 98669 31117 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.